క్లుప్తంగా

తుది ఓటరు జాబితా విడుదల

కొడకండ్ల: తుది ఓటరు జాబితాను మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రచురించినట్లు ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి తెలిపారు. అభ్యంతరాల అనంతరం తుది జాబితాను విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ ఇందిర, జ్ఞానేశ్వర్, సంఘమిత్రరెడ్డి, నవీన్‌లు పాల్గొన్నారు.

లింగాలఘణపురం: మండల పరిషత్ కార్యాలయంలో అసిస్టెంట్ ఎలక్షన్ అథారిటీ, ఎంపీడీఓ రఘురామకృష్ణ మండల తుది ఓటరు జాబితాను ప్రకటించారు. మండలంలోని మొత్తం 21 పంచాయతీల్లో 196 వార్డులు , 196 పోలింగ్ స్టేషన్లలలో మొత్తం ఓటర్లు 33,356 కాగా అందులో పురుషులు 16,323, మహిళలు 17,033 ఓటరు ఉన్నారు. సూపరింటెండెంట్ సీతారామనాయుడు, పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

గణేశ్ మండపం వద్ద విదేశీ వస్తువుల బహిష్కరణ

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని గుండ్లగడ్డ గణేశ్ మండపం వద్ద చుంచు శ్రీకాంత్ ఆధ్వర్యంలో మంగళవారం విదేశీ వస్తువుల బహిష్కరణ కార్యక్రమం చేపట్టారు. అమెరికా భారతదేశం వస్తువులపై అధిక శాతం పన్నులు విధించడం సరికాదని, విదేశీ వస్తువులను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా పెప్సీ, కొకాకోలా లాంటి కూల్‌డ్రింక్స్ తాగకూడదని, స్వదేశీ కొబ్బరిబోండాలు, చెరుకు రసం తాగాలని అన్నారు. పవన్, చారి, రాజేశ్వరి, నీలవేణి, రాణి, రామా, రాజమణి, సుభద్ర, అనురాధ, లక్ష్మి, ఉమ, ప్రమీల, కామాక్షి పాల్గొన్నారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ



చిల్పూరు: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి చట్టం అమలులో భాగంగా 40 వర్కింగ్ డేస్ అప్రెంటిషిప్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాజవరం గ్రామ సమీపంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అడిషనల్ డైరెక్టర్ మన్యం కొండ గ్రామాల మ్యాప్, సర్వే నంబర్ సరిహద్దు రాళ్లు గుర్తించడం, పునర్‌నిర్మించడం, ప్రభుత్వ భూములను గుర్తించడంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రాజు, మండల సర్వేయర్ శ్రీను, లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఊరడి సతీష్, గొడుగు రితీష్, సతీష్ పాల్గొన్నారు.

టీఎల్‌ఎంతో ఉత్తమ బోధన



తరిగొప్పుల: బోధనాభ్యసన సామగ్రి వినియోగంతో బోధన సులభతరమవుతుందని, విద్యార్థుల్లో అభ్యసన వేగం పెరుగుతుందని మండల విద్యాశాఖ అధికారి నెల్లుట్ల జానకి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి టీఎల్‌ఎం కాంప్లెక్స్ హెచ్‌ఎం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి 60 రకాల బోధనాభ్యసన సామగ్రి ప్రదర్శించారు. న్యాయనిర్ణేతలుగా అనిత, లిల్లీమేరీ, రవి, అమర్‌నాథ్ వ్యవహరించి ఉత్తమ ప్రదర్శన కనబర్చిన ఉపాధ్యాయులను జిల్లా స్థాయికి ఎంపిక చేసి మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డామరేశానందనాథ శతజయంతి



జనగామ: జిల్లా కేంద్రంలోని సాయినగర్ కాలనీలోని సాయిబాబా మందిరంలో డామరేశానందనాథ గురువు శతజయంతి వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో శిష్యులు, భక్తులతో గురునామ సంకీర్తననాదంతో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డామరేశానందనాథ గురువుకు పల్లకీ సేవ, గురుపూజ చేశారు. చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం భక్తులు గురు ప్రసాదం స్వీకరించారు.

దరఖాస్తు చేసుకోండి

జనగామ రూరల్: శామీర్‌పేట్‌లోని మైనారిటీ గురుకుల బాలుర కళాశాలలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఫిజికల్ సైన్స్ జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి బి.విక్రమ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజికల్ సైన్స్‌లో 50 శాతం మార్కులతో పీజీ పూర్తి చేసి బీఈడ్ అర్హత కలిగి బోధనలో మూడు సంవత్సరాల అనుభవం ఉన్న 44 సంవత్సరాల వయసులోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 9వ తేదీలోగా జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

రోడ్డెక్కిన రైతన్న

సాక్షి, నెట్‌వర్క్: రైతుల యూరియా కష్టాలు తీరడం లేదు. జిల్లా వ్యాప్తంగా యూరియా కోసం రైతులు సొసైటీలు, రైతు వేదికలు, ఫర్టిలైజర్ షాపుల ఎదుట పడిగాపులు కాస్తున్నారు. మంగళవారం జనగామ పట్టణంలోని మునిసిపల్ కార్యాలయ ఏరియా హాకా ఫార్మర్ సొసైటీ వద్ద యూరియా కోసం ఉదయం నుంచే వందలాది మంది రైతులు క్యూ కట్టారు. రోజుల తరబడి తిరుగుతున్నా యూరియా బస్తాలు దొరకకపోవడంతో ఆగ్రహంతో వివిధ గ్రామాలకు చెందిన రైతులు, మహిళలు స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. దాదాపు అరగంట పాటు రాస్తారోకో చేయగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. సాయంత్రానికి స్టాక్ వస్తుందని, బుధవారం ఉదయం పంపిణీ చేస్తామని అధికారులు, పోలీసులు నచ్చజెప్పడంతో రైతులు రాస్తారోకో విరమించారు. యూరియాను సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, సీపీఐ, రైతు సంఘం, బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జఫర్‌గఢ్ సొసైటీ కార్యాలయం ఎదురుగా ఉన్న స్టేషన్ ఘన్‌పూర్–వర్ధన్నపేటకు వెళ్లే ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. చిల్పూరు, కొడకండ్ల తదితర మండలాల్లోనూ యూరియా కోసం రైతులు బారులుదీరారు.



జనగామ: సొసైటీ వద్ద నిలబడే ఓపిక లేక నేలపై కూర్చున్న మహిళలు, బందోబస్తు చేపడుతున్న మహిళా కానిస్టేబుళ్లు



కొడకండ్లలో ఫర్టిలైజర్ షాపు ఎదుట బారులుదీరిన రైతులు



జఫర్‌గఢ్‌లో రాస్తారోకోలో పాల్గొన్న నాయకులు, రైతులు



స్టేషన్‌ఘన్‌పూర్: జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

యూరియా అందించడంలో సర్కార్ విఫలం

- మాజీ ఎమ్మెల్యే రాజయ్య



రఘునాథపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు యూరియా అందించడంలో ఘోరంగా విఫలం అయిందని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆరోపించారు. మంగళవారం కంచనపల్లిలో ఫర్టిలైజర్ షాపుల వద్ద యూరియా కోసం బారులుదీరిన రైతుల కష్టాలు ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమని, నిత్యం యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలే నిదర్శనమన్నారు. ఇప్పటికైనా అన్నదాతలకు యూరియా అందుబాటులో ఉంచాలన్నారు.

కేసీఆర్‌పై ఆ ముగ్గురి కుట్ర

- బనకచర్ల ప్రాజెక్టు కోసం రేవంత్, బాబు, మోదీ కుటిలయత్నం
- ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సీఎం రేవంత్‌రెడ్డి, ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేసీఆర్‌పై కుట్రలకు పూనుతున్నారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. మూడు నెలల క్రితం ప్రమాదవశాత్తు గాయపడిన ఆయన కోలుకున్న తర్వాత మంగళవారం నియోజకవర్గానికి మొట్టమొదటిసారిగా వచ్చారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో వడ్లకొండ ఎక్స్‌రోడ్డులో ఘన స్వాగతం పలుకుతూ బాణాసంచా పేల్చారు. అక్కడి నుంచి హైదరాబాద్ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌కు వేలాది మంది పార్టీ శ్రేణులతో కలిసి చేరుకున్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమావేశంలో పల్లా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.. సీబీఐ ఎంక్వయిరీ పేరుతో కేసీఆర్‌పై చర్యలు తీసుకుంటే తెలంగాణ భగ్గుమంటుందని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు కలిసి తెలంగాణ గోదావరి జలాలను ఆంధ్రాకు తీసుకువెళ్లేందుకు బనకచర్ల ప్రాజెక్టు కోసం కుట్రలో భాగమే సీబీఐ ఎంక్వయిరీ అన్నారు. కార్యక్రమంలో పోకల జమునలింగయ్య, ఇర్రి రమణారెడ్డి, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, మేకల కలింగరాజు, గద్దల నర్సింగారావు, పెద్ది రాజిరెడ్డి, పసుల ఏబేలు, ముస్త్యాల దయాకర్, ధర్మపురి శ్రీనివాస్, బాల్దె కమలమ్మ, పగిడిపాటి సుధసుగుణాకర్‌రాజు, ఎండీ సమ్మద్, గంగం సతీష్‌రెడ్డి, మేకల రాంప్రసాద్, గుర్రం భూలక్ష్మినాగరాజు, పాక రమ, మామిడాల రాజు తదితరులు ఉన్నారు.



జనగామ: ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

బచ్చన్నపేటలో కరువు..

బచ్చన్నపేట: మండలంలో కరువు కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని, కరువుకు కేరాఫ్‌గా ఉన్న ఈప్రాంత ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఆయన మాట్లాడారు.. మాజీ సీఎం కేసీఆర్‌కు అత్యంత ఇష్టమైన మండలం సాగునీరు లేక కరువుతో నేడు అల్లాడుతోందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పులిగిల్ల పూర్ణచందర్, మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, నాయకులు రమణారెడ్డి, కృష్ణంరాజు, అనిల్‌రెడ్డి, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి



పోస్టుకార్డులను పంపుతున్న నాయకులు

పాలకుర్తి టౌన్: ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అర్హత కమిటీ చైర్మన్ గుగులోత్ దేవ్‌సింగ్(రాములు నాయక్) అన్నారు. ఈ మేరకు మంగళశారం మండల కేంద్రంలో హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి పోస్టు కార్డుల ద్వారా విజ్ఞప్తి చేశారు. సంఘం నియోజవర్గ కన్వీనర్ సంఘీ వెంకన్న, సింగా మహేందర్‌రాజు, ఎడవెల్లి దండయ్య, కమ్మగాని రమేష్, మార్కండేయ్య,మల్లారెడ్డి, ఎడవెల్లి కొమరుమల్లు పాల్గొన్నారు.

సంధ్య మృతి తీరని లోటు

జనగామ రూరల్ : సీపీఎం నాయకురాలు సంధ్య మృతి పార్టీకి, కుటుంబానికి తీరని లోటని జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. మంగళవారం వడ్లకొండ గ్రామానికి చెందిన బొట్టు సంధ్య మృతి చెందగా ఆమె మృతదేహానికి పార్టీ నాయకులు పూల మాలవేసి నివాళులర్పించారు. సాంబరాజు యాదగిరి, ఇర్రి అహల్య, బొట్ల శేఖర్, బోడ నరేందర్, బూడిద గోపి తదితరులు ఉన్నారు.

కేసీఆర్ జోలికొస్తే కాంగ్రెస్ భూస్థాపితమే

- మాజీ మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల: తెలంగాణ ఉద్యమనేత కేసీఆర్ జోలికి వస్తే కాంగ్రెస్ పార్టీ భూస్థాపితమేనని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హెచ్చరించారు. మంగళవారం మండలకేంద్రంలోని జనగామ–సూర్యాపేట రహదారి చౌరస్తాలో కేసీఆర్‌పై అక్రమ కేసులు, రైతులకు యూరియా తిప్పలుపై నిరసిస్తూ నల బ్యాడ్జీలు ధరించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. 420 హామీలను అమలుచేయని దుస్థితిలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నీచ రాజకీయాలు చేస్తోందన్నారు. నియోజకవర్గంలో సాగునీటి సమస్య పరిష్కారంలో స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి విఫలమయ్యారన్నారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి, జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దయాకర్, రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్‌సింగ్, మాజీ ఎంపీపీ సోమన్న పాల్గొన్నారు.



దేవరుప్పులలో సూర్యాపేట రహదారిపై నల్లబ్యాడ్జీలతో రాస్తారోకోలో మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు

యూరియా కష్టాలు తీర్చాలి..

పాలకుర్తి టౌన్: రైతులకు యూరియా కష్టాలు తీరే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రం, తొర్రూరు సొసైటీ వద్ద రైతులు యూరియా కోసం బారులదీరడంతో దయాకర్‌రావు రైతులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్‌కుమార్, జిల్లా నాయకుడు జరుపుల బాలునాయక్, మాజీ జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాలు ఆంధ్రాకు..

కొడకండ్ల: తెలంగాణ రాష్ట్రాన్ని పోరాడి సాధించుకుంది నీళ్ల కోసమైతే ఇప్పుడు అదే నీళ్లను ఆంధ్రాకు తీసుకెళ్లే కుట్రను కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో సిందె రామోజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో దయాకర్‌రావు పాల్గొన్నారు.

బీమాతో ధీమా



ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఏజెంట్లు

జనగామ: ప్రతి ఒక్కరికి బీమా అవసరమని, బీమా చేసి ధీమాగా ఉండాలని ఎల్‌ఐసీ సీనియర్ మేనేజర్ గుగులోత్ హరిలాల్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఎల్‌ఐసీ 69వ వారోత్సవాల సందర్భంగా ఉద్యోగులు, అధికారులు, వికాసాధికారులు, ఏజెంట్లు సంయుక్తంగా ర్యాలీ నిర్వహించారు. ఎల్‌ఐసీ సాధించిన విజయాలు, నూతన పాలసీల ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎల్‌ఐసీలో పెట్టుబడులు పెట్టినా మీ డబ్బు సుక్షితంగా పెంపుదల అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు గట్టు అమర్‌నాథ్, లాల్‌సింగ్, ప్రణయ్‌కుమార శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

హర్షణీయం

జఫర్‌గఢ్: దేవాదులకు సంబంధించి ఫేజ్–3 ప్యాకేజీ 6 పనుల నిధుల మంజూరుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూకల ఐలయ్య, పార్టీ సీనియర్ నాయకులు అన్నెబోయిన భిక్షపతి, సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు పేర్కొన్నారు. మండల కేంద్రమైన జఫర్‌గఢ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నాయకులు కుల్లా మోహన్‌రావు, సీహెచ్ కృష్ణమూర్తి, బానోత్ రాజేష్‌నాయక్, గుజ్జరి రాజు, ఇల్లందుల శ్రీనివాస్, అన్నెపు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వారోత్సవాలు

స్టేషన్‌ఘన్‌పూర్: వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరించే శక్తుల కుట్రలను తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు రాపర్తి రాజు అన్నారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు కొనసాగుతున్నాయి. వారోత్సవాలను పురస్కరించుకుని ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో మంగళవారం సీపీఎం జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి మునిగెల రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాజు మాట్లాడారు.

సన్మానం



బచ్చన్నపేట: వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా కేసిరెడ్డిపల్లిలో సీపీఎం నాయకులు అమరవీరుల స్తూపాల వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయుధ పోరాటంలో అమరులైన వారి కుటుంబ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్, రవీందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, ఎల్లారెడ్డి, లక్ష్మణ్, గాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మహానేతకు ఘన నివాళి



తరిగొప్పుల: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా మంగళవారం కాంగ్రెస్ శ్రేణులు, ఆయన అభిమానులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వైఎస్సార్ సీఎంగా ఉన్న సమయంలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి పేదల గుండెల్లో చెరగని ముద్ర వేశారని అన్నారు.



చిల్పూరు: వంగాలపల్లిలో..



పాలకుర్తి: తీగారంలో..



బచ్చన్నపేటలో..

సంక్షిప్త సమాచారం

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కొడకండ్ల: గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి కోరారు. మంగళవారం లక్ష్మక్కపల్లి శివారు జేత్యాతండాకు చెందిన పలువురు గిరిజనులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి ఆమె కండువా కప్పి ఆహ్వానించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్‌నాయక్, రాజేష్‌నాయక్, శ్రీనివాస్, నాగరాజు, యాకయ్య, వీర్యానాయక్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

పాలకుర్తి: మంచుప్పుల గ్రామంలో కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో మాజీ ఎంపీటీసీ బండపల్లి సోమయ్య, ఒక్కల మల్లయ్య, పూజారి కృష్ణమూర్తి ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పలువురి రాజీనామా

దేవరుప్పుల: ఇటీవల కాంగ్రెస్‌లో చోటుచేసుకుంటున్న అసంతృప్తి రాజకీయాలను సమన్వయం చేయలేని పరిస్థితుల్లో పలువురు పార్టీకి రాజీనామా చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం సింగరాజుపల్లికి చెందిన కాంగ్రెస్ యువజన విభాగం మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి వేణు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు జోగు నర్సయ్య జాటోత్ లక్ష్మి చంద్రయ్య మూకుమ్మడిగా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తూ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి లేఖ పంపినట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్ రాస్తారోకో

పాలకుర్తి టౌన్: తెలంగాణ జీవధార కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ కక్షతో కేసీఆర్‌ను అప్రతిష్ట పాలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే దుష్ప్రచారం చేస్తుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



జనగామ రూరల్: తల్లులు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ పూర్ణిమ అన్నారు. మంగళవారం పట్టణంలోని సత్రంకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లులు, పిల్లలు పోషకాహారం లభించే కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు తీసుకోవాలన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన చేశారు.

యూరియా సమస్యను పరిష్కరించాలి

దేవరుప్పుల: ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేసే రైతాంగానికి యూరియా కొరత లేకుండా ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని ప్రజాకవి, గాయకుడు సురేష్ మహాజన డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పాలిత కర్ణాటక, ఏపీ తదితర రాష్ట్రాల్లో లేని యూరియా కొరత ఇక్కడ ఉందంటే సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యవైఖరికి అద్దం పడుతుందన్నారు.

పాముకాటుతో ఆవు మృతి

బచ్చన్నపేట: పాముకాటుతో ఆవు మృతి చెందిన సంఘటన లక్ష్మాపూర్ శివారులో మంగళవారం జరిగింది. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం మర్మాముల శివారు బంజేరుకు చెందిన ఇండ్ల చంద్రమౌళి వ్యవసాయ బావి వద్ద రోజు మాదిరిగా ఆవును కట్టేశాడు. ఉదయం వచ్చి చూసే సరికి నురుగులు కక్కుతూ మృతి చెంది కనిపించింది. ఆవు విలువ రూ.70 వేలు ఉంటుందని, రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని పలువురు కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

జనగామ రూరల్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి దాసగాని సుమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్ బాకాయిలు విడుదల చేయాలని కోరుతూ మంగళవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్రంలో గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థుల ఫీజుపై తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, కనీసం చర్చ కూడా చేయలేదని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బొమ్మిశెట్టి ఆర్య, జిల్లా కమిటీ సభ్యులు బైరపాక జగన్ కుందేళ్ళ స్నేహ, కడారి మానస, సోహెల్, శశికాంత్, అరవింద్ ,ఆర్మన్ మనీషా, గీత, నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఇల్లు ఖాళీ చేయాలని నిరసన

- సబ్ రిజిస్ట్రార్‌తో బాధితుల వాగ్వాదం

స్టేషన్‌ఘన్‌పూర్: తాము సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి అద్దెకు ఇచ్చిన ఇంటిని ఖాళీ చేయాలని డిమాండ్ చేస్తూ ఇంటి యజమాని కుటుంబ సభ్యులతో కలిసి కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన సంఘటన మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండకు చెందిన శీలం శ్యామ్ స్టేషన్‌ఘన్‌పూర్‌లోని తన ఇంటిని 2022 ఆగస్టు 22న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రెండు సంవత్సరాల లీజ్ అగ్రిమెంట్‌తో అద్దెకు ఇచ్చారు. అయితే లీజ్ ముగిసి ఏడాది గడుస్తున్నా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఖాళీ చేయడం లేదని కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాధితుడు శ్యామ్ మాట్లాడుతూ ప్రస్తుతం నాన్న ఆరోగ్యం బాగా లేక ఇక్కడే ఉండాలని నిర్ణయించుకున్నామని, ఈ విషయమై సబ్‌రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్తే స్పందించక పోవడంతో సోమవారం సాయంత్రం ఇంటికి తాళం వేశామన్నారు. అయితే తమకు చెప్పకుండా తాళం పగులగొట్టి యథావిధిగా కార్యాలయ పనులు నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటికి వేసిన తాళం ఎందుకు పగులగొట్టావని సబ్ రిజిస్ట్రార్‌ను అడిగితే కోర్టుకు వెళ్లు అని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడని వాపోయారు. లీజ్ అగ్రిమెంట్ ముగిసి ఏడాది గడుస్తున్నా ఖాళీ చేయడం లేదని, ఈ విషయమై బాధితుడికి కుటుంబ సభ్యులకు సబ్ రిజిస్ట్రార్‌తో వాగ్వాదానికి దిగారు. తమకు రావాల్సిన పెండింగ్ అద్దెను వెంటనే అందించి ఖాళీ చేయాలని వారు డిమాండ్ చేశారు. కాగా, గొడవ జరుగుతున్న విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై వినయ్‌కుమార్ అక్కడకు చేరుకుని బాధితులు,సబ్ రిజిస్ట్రార్‌తో మాట్లాడారు. ఇరువురికి నచ్చచెప్పి సమస్యను తాత్కాలికంగా పరిష్కారం చేశారు. సబ్ రిజిస్ట్రార్ కోరిక మేరకు నెలరోజులు గడువు ఇవ్వాలని బాధితులకు సూచించారు. సబ్‌రిజిస్ట్రార్ మాట్లాడుతూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని, అద్దె చెల్లింపు తన చేతిలో ఉండదని. ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సి ఉంటుందన్నారు. కార్యాలయాన్ని మార్చేందుకు స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లిలో భవనాలను చూస్తున్నామని, నెలరోజులు గడువు ఇస్తే ఖాళీ చేస్తామని తెలిపారు.



నిరసన తెలుపుతున్న బాధితులు

గణనాథుడికి పూజలు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా మండపాల్లో కొలువుదీరిన గణనాథుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కుంకుమార్చన చేపట్టారు. పలు మండపాల వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. పలువురు ప్రముఖులు వినాయకుడిని దర్శించుకుని పూజలు చేశారు.



దేవరుప్పుల: భజన చేస్తున్న భక్తులు



జనగామ: పూజలో పాల్గొన్న మహిళలు



వాసవీకాలనీలో దీపారాధన చేస్తున్న మహిళలు



స్టేషన్‌ఘన్‌పూర్: పూజలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు